## క్లుప్తంగా

### మౌలిక వసతులు కల్పించండి


జెండా ఆవిష్కరణ చేస్తున్న సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీను

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతిబసుకాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను పేర్కొన్నారు. సోమవారం జ్యోతిబసుకాలనీ శాఖ మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబసు కాలనీ ఏర్పాటై 15 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికీ మౌలిక వసతులు కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.చిన్ని, కొండయ్య, పట్టణ కమిటీ సభ్యురాలు మోక్షమ్మ, ఖైరున్‌బీ, మస్తాన్‌బీ, సుబ్బరాయుడు, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

### డీటీకి సన్మానం


డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్‌ను సన్మానిస్తున్న వీఆర్‌ఓలు

అట్లూరు : బదిలీపై వెళుతున్న డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్‌కు సోమవారం తహసీల్దారు కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా ఈయన కాశినాయన మండలానికి బదిలీ అయ్యారు. అయితే ఈయన అట్లూరులో తహసీల్దారు లేక పోవడంతో ఇన్‌చార్జ్ తహసీల్దారుగా విధులు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శిరీషా, ఏపీ వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం, సీనియర్ అసిస్టెంటు వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్లు వేణుగోపాల్, శక్తికుమార్, బండెయ్య వీఆర్‌ఓలు వెంకటసుబ్బమ్మ, దొరబాబు, సుబ్బన్న, సర్వేయర్లు, మరియూ విఆర్‌ఏలు పాల్గొన్నారు.

### వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విరజానందస్వామి

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని బలిజ కాపు తెలగ అన్నదాన సంఘం ఆధ్వర్యంలో జల ప్రసాదం కేంద్రంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బలిజ కాపు తెలగ సంఘం అధ్యక్షులు శ్రీరాములు, కార్యదర్శి బొల్లు సిద్దయ్య, ఉపాధ్యక్షులు ఆవుల బాల రోశయ్య, ఓబులేసు, ఎస్ రమణ, కోశాధికారి కొండయ్య, ఏపీ జేఏసీ కార్యదర్శి అల్లం రంగనాయకులు పాల్గొన్నారు.

### ఆర్‌ఐగా అమర్‌నాథరెడ్డి

కాశినాయన : మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా అమర్‌నాథరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బి.కోడూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఆర్‌ఐగా పనిచేస్తున్న దక్షిణమూర్తి కడపకు బదిలీ అయ్యారు.

### తహసీల్దార్‌కు వినతి

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీనివాసనగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కుక్కల ఆస్పత్రిని నిర్వహిస్తున్న తెల్లాకుల మనోహర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ సోమవారం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందించారు. ఎటువంటి అర్హతలు లేకుండా కుక్కలకు వైద్యం చేస్తూ వాటి ప్రాణాలతో చెలగాటమాడుతున్న మనోహర్, అతని భార్యపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### ధ్యానంతో మానసిక ప్రశాంతత

ప్రొద్దుటూరు కల్చరల్ : ధ్యానంతో శారీరక, మానసిక ప్రశాంతత చేకూరుతుందని ధ్యాన శిక్షకులు సత్యప్రవీణ్ తెలిపారు. స్థానిక మిట్టమడి వీధిలో రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో హార్ట్ ఫుల్ నెస్ ధ్యానోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలన్నారు. దీని వల్ల నిద్రలేమి, ఒత్తిడి వంటి శారీరక రుగ్మతలు తొలగిపోయి ఆనందమయ జీవితం పొందవచ్చన్నారు. ధ్యానం చేయడం వల్ల ఉపయోగాలను అందరికి వివరించారు.

### జూదరుల అరెస్టు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సిద్దవటం రోడ్డులోని ఫారెస్టు ఆఫీసు వెనుక వైపు మహమ్మద్‌కాలనీ సమీపంలోని ముళ్లపొదల్లో సోమవారం పేకాట ఆడుతున్న 7 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.32,600లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించగా పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 7 మంది వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించారన్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.32,600లతో పాటు పేకముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో అర్బన్ ఎస్‌ఐ జె.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# రియల్టర్లా.. మజాకా!

- ప్లాట్ల అమ్మకాల కోసం రోడ్డు ఏర్పాటు
- అడ్డొచ్చిన పంట కాలువ పూడ్చివేత
- వర్షం నీరు వెళ్లే మార్గం లేక.. ఎక్కడికక్కడే నిలిచిపోతున్న వైనం
- పట్టించుకోని రెవెన్యూ, పంచాయతీ అధికారులు


రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం నిర్మించిన గ్రావెల్ రోడ్డు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఏకంగా 40 ఏళ్ల క్రితం నుంచి ఉన్న పంట కాలువలను పూడ్చివేశారు. చాపాడులోని దళితవాడ నుంచి వృథా నీరు పంట కాలువల ద్వారా గుండ్లకమ్మ వంకలోకి చేరుతుంది. ఈ క్రమంలో గత కొంత కాలంగా మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ పక్క నుంచి దళితవాడ నుంచి వచ్చే వృథా నీరు పంట కాలువల ద్వారా వెళ్లిపోతుంది. అయితే కొన్ని నెలల క్రితం టింబర్ డిపో వద్ద వేసిన ప్లాట్ల నిర్మాణం, విక్రయాల కోసం గ్రావెల్ రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మించే క్రమంలో పంట కాలువను పూడ్చివేయటంతో నీరు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దళితవాడలోని వర్షపు నీరంతా పంట కాలువల ద్వారా వెళ్లిపోవాల్సి ఉండగా.. కాలువను పూడ్చివేయటంతో ఇండేన్ గ్యాస్, దీని పక్కనే ఉన్న సీబీఆర్ కాంప్లెక్స్, పలువురి ఇళ్లు, దుకాణాల చుట్టూ చేరుతోంది. వృథా నీరు వెళ్లేందుకు కాలువ లేకుండా పూడ్చివేయడంతో రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన రావటంతోపాటు ప్రమాదకరమైన దోమల వ్యాప్తి జరుగుతోంది. ఇటీవల నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న ప్లాట్‌లను పంచాయతీ, రెవెన్యూ అధికారులు పరిశీలించి నోటీసులు జారీ చేసినప్పటికీ పూడ్చిన పంట కాలువను పట్టించుకోవపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృథా నీరంతా పంట కాలువల ద్వారా వంకలోకి చేరేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ బంగారు భవిష్యత్‌కు బాట వేసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక గీతాశ్రమంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అర్కటవేముల హరినారాయణ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా ఈ–బోధన అందిస్తున్నామని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహమ్మద్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపాల్ శారద, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ్మోహన్, హెచ్‌ఓడీలు గంగాభవాని, నరేష్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు మున్సిపల్ సమావేశం

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ సర్వసభ్య అత్యవసర సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎం.శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ సభాభవనంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కౌన్సిలర్లు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

### నేడు మండల మీట్

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జీ ఎంపీడీఓ రామానుజం తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు మండల అధ్యక్షుడి అధ్యక్షతన జరుగనున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

## అర్హులకు భూములు మంజూరు చేయాలి


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీకేఎంయూ, డీహెచ్‌పీఎస్ నాయకులు

బద్వేలు అర్బన్ : బద్వేలు రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా ఉన్న అర్హులైన ప్రతి వ్యవసాయ కూలీకి, దళితులకు మూడు ఎకరాలు ప్రభుత్వ భూమితోపాటు ఇంటి స్థలాన్ని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షులు ఇమ్మానుయేల్‌లు పేర్కొన్నారు. వ్యవసాయ కూలీలకు, దళితులకు వ్యవసాయ భూమి, ఇంటి స్థలం మంజూరు చేయడంతో పాటు ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలని కోరుతూ సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ వ్యవసాయ కూలీలు, దళితులకు భూములు పంపిణీ చేయకుండా కాలయాపన చేయడం దుర్మార్గమన్నారు. ఎంతో మంది లబ్ధిదారులు ప్రభుత్వ భూములు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఏ ఒక్కరికి భూములు పంచిన పాపాన పోలేదని అన్నారు. బద్వేలు మండలం ఆనందనగర్ ఎస్టీకాలనీలో కొంత మంది ఎస్టీలకు భూములు కేటాయించినప్పటికీ నేటికీ వారికి భూములు స్వాధీనపరచలేదని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి అసైన్డ్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించి అర్హులైన వారికి భూములు పంచాలని కోరారు. అనంతరం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు షావలీ, గోపవరం మండల కార్యదర్శి ఖాదర్‌బాషా, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు పెంచలయ్య, పట్టణ కార్యదర్శి మునిరత్నం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### గంగన్నకు నివాళి

ఖాజీపేట : పాటిమీదపల్లె గ్రామానికి చెందిన దాసరి గంగన్న యాదవ్ గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ సోమవారం మృతి చెందాడు. ఆయన మృతి విషయం తెలియగానే వైఎస్సార్ సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆయన సోదరుడు కేసీకెనాల్ ప్రాజక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి వెళ్లి నివాళి అర్పించారు. మృతికి గల కారణాలను వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

### ఎరువుల దుకాణం తనిఖీ

గోపవరం : బద్వేలు పట్టణంలోని సాయిసప్తగిరి ఎరువుల దుకాణాన్ని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే ఎరువుల బస్తాల తూకాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. గడువు ముగిసిన విత్తనాలు, పురుగు మందులు రైతులకు విక్రయించరాదన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని, అలాగే ధరల పట్టిక రైతులకు కనపడేలా ఏర్పాటు చేయాలన్నారు. రైతుల నుండి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా సంబంధిత దుకాణాదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మార్కెట్ యార్డు ఆవరణలోని ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. ఏడీఏ వెంట ల్యాబ్ వ్యవసాయాధికారి మాధురి, సహాయ సిబ్బంది అరుణ, రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

## రెండు రోజుల పాటు 'పొలం పిలుస్తోంది'

అట్లూరు : నేడు, రేపు నిర్వహించనున్న పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. ప్రతి మండల పరిధిలో రెండు గ్రామాలను ఎంపిక చేసుకుని ఆయా గ్రామాలలోని రైతులతో మండల వ్యవసాయ అధికారులతోపాటు రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు కలసి సాగులో ఉన్న పొలాలను పరిశీలస్తారన్నారు. అలానే వారికి తగు సలహాలు సూచనలు చేస్తారని చెప్పారు. బద్వేలు మండలంలో గూడెం గ్రామంతోపాటు అగ్రహారం, అట్లూరు మండలంలో మాడపూరు, కోనరాజుపల్లి, గోపవరం మండలంలో బ్రాహ్మణపల్లి, అదుచువారిపల్లి గ్రామాలలో కార్యక్రమం ఉంటుందన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం


మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న తెలుపుతున్న దొరసానిపల్లె నాయకులు

ప్రొద్దుటూరు : ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం పలువురు ఆయనను కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ అపార నమ్మకంతో తనకు ఈ పదవి ఇచ్చారన్నారు. అంతే బాధ్యతగా తాను పని చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. రాచమల్లును కలిసిన వారిలో దొరసానిపల్లె ఉపసర్పంచ్ మార్తల లక్ష్మీనారాయణ రెడ్డి, చిన్నరెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, కల్లూరు ఉపసర్పంచ్ మారెడ్డి నరేంద్రారెడ్డి, కమ్మక్క, ఓబులేసు తదితరులు ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల బదిలీ

చాపాడు : మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల కార్యదర్శులు బదిలీ అయ్యారని ఇన్‌చార్జీ ఎంపీడీఓ రామానుజం తెలిపారు. బద్రిపల్లె పంచాయతీ కార్యదర్శిగా అల్లాడుపల్లె కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్.ఓబాయపల్లె కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి పెద్దగురువళూరుకు వెళ్లగా, అక్కడ ఉన్న కార్యదర్శి ధనేశ్వరబాబు ఎస్.ఓబాయపల్లెకు, రాజువారిపేట పంచాయతీ కార్యదర్శి వేణు అయ్యవారిపల్లెకు, కలసపాడు మండలం నుంచి శ్రీనివాసులు అన్నవరం పంచాయతీకి బదిలీ అయ్యారు. మైదుకూరు మండల నంద్యాలం పేట నుంచి చిన్నగురువళూరుకు మాధవి, చాపాడు పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్‌బాబు ప్రొద్దుటూరు మండలం కల్లూరుకు, మడూరు కార్యదర్శి భాగ్యలక్ష్మీ చౌడూరుకు, విశ్వనాథపురం కార్యదర్శి సురేష్‌రెడ్డి దువ్వూరు మండలం ఎర్రబల్లికి బదిలీ అయ్యారు. కుచ్చుపాప కార్యదర్శి అప్సర్ ఉన్నీసా గోపవరం–5కు చిన్నగురువళూరులో పని చేస్తున్న పులివేందుల మండలానికి బదిలీ అయ్యారు. ఇదే క్రమంలో చాపాడు సచివాలయంలో పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంటు చంద్రకాంత్ బ్రహ్మంగారిమఠం మండలం నాగిశెట్టిపల్లెకు, సోమాపురం డీఏ సుభాష్ సోమిరెడ్డిపల్లెకు, అల్లాడుపల్లె డీఏ శివశంకర్ బద్రిపల్లెకు, బద్రిపల్లె నుంచి గోపి మైదుకూరుకు బదిలీపై వెళ్లినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన అధికారులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలానికి చెందిన పలువురు అధికారులు సోమవారం విధుల్లో చేరారు. పంచాయతీ రాజ్ ఏఈగా గణేష్, ఈఓపీఆర్డీగా రామాంజనేయరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సోములవారిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్, దొరసానిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సాంబశివారెడ్డి, కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రామ్మోహన్‌రెడ్డి, చౌటపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బి.శిరీష, చౌడూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా భాగ్యలక్ష్మి, కల్లూరు పంచాయయతీ కార్యదర్శిగా ధనుంజయ బాబు విధుల్లో చేరారు. మండల పరిషత్ కార్యాలయ అటెండర్లుగా శ్రీను, సుబ్బరాయుడు విధుల్లో చేరారు. అనంతరం వీరు ఎంపీడీఓ సానేపల్లి సూర్యనారాయణరెడ్డిని కలిశారు.

**పోరుమామిళ్ల ఎంపీడీఓగా రమణారెడ్డి**

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండల అభివృద్ధి అధికారిగా ఆర్.రమణారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న వరప్రసాదరావు కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. మైదుకూరు మండలంలో పంచాయతీ రాజ్ విస్తరణాధికారిగా పని చేస్తున్న రమణారెడ్డి బదిలీలో భాగంగా ఇక్కడకు ఎంపీడీఓగా వచ్చారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండటంతో పాటు మండల అభివృద్ధికి కృషి చేస్తానని రమణారెడ్డి అన్నారు.

**ప్రొద్దుటూరు కమిషనర్‌గా మల్లికార్జున**

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఆయన ప్రొద్దుటూరుకు రాగా, ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డిని బాపట్లకు బదిలీ చేశారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి


బంగారు వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

పోరుమామిళ్ల : పట్టణంలోని బంగారు దుకాణాల్లో వ్యాపారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ శ్రీనివాసులు చెప్పారు. సోమవారం బంగారు వ్యాపారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి బంగారు కొనడానికి వచ్చే కొత్త వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. దొంగబంగారం అమ్మేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బంగారు కుదువ పెట్టేందుకు వచ్చిన వారి పూర్వాపరాలు తెలుసుకోవాలన్నారు. గోల్డ్ షాపులో మీ వస్తువుల పట్ల మీరే జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో పట్టణ బంగారు వ్యాపారులు పాల్గొన్నారు.

### బ్రహ్మంగారిమఠంలో ప్రత్యేక పూజలు


ధ్వజస్తంభానికి పూజ చేస్తున్న శ్రీ వెంకటాద్రిస్వామి

బ్రహ్మంగారిమఠం : జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవీ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా 5వ రోజు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని దేవతా మూర్తులు, ధ్వజస్తంభానికి పూర్వ మఠాధిపతి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి పూజలు చేశారు. కార్యక్రమంలో పూర్వ మఠాధిపతి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# జయములివ్వు తల్లీ.. జగజ్జననీ


ప్రొద్దుటూరు కల్చరల్ : రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి


కలసపాడు : ఆలయంలో ఏర్పాటు చేసిన తోటోత్సవం


ఖాజీపేట: అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు


ప్రొద్దుటూరు చెన్నకేశవాలయంలో మోహిని వనవిహారిణి


ప్రొద్దుటూరు ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో..


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో బిల్వవృక్ష నివాసిని..


రాజుపాళెం : పార్వతీదేవి అలంకారంలో అంకాళమ్మ



మైదుకూరు అమ్మవారిశాలలో శ్రీఅన్నపూర్ణాదేవి


దువ్వూరు: లలితాదేవి అలంకరణలో వాసవి మాత


చాపాడు: పార్వతి దేవి అలంకారంలో పెద్దమ్మ తల్లి


బ్రహ్మంగారిమఠం : శ్రీ ఈశ్వరీ దేవిమఠంలో లలితాదేవి


బి.మఠం అమ్మవారిశాలలో శ్రీదేవి వనవిహారిణిగా..


కాశినాయన: నరసాపురంలో పార్వతీదేవి అలంకారంలో


పోరుమామిళ్ల: శ్రీరామావతార అలంకారంలో వేంకటేశ్వరస్వామి


బద్వేలు అర్బన్: అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవి


బద్వేలు అర్బన్: కోదండ రామాలయంలో సరస్వతీదేవి

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రొద్దుటూరు క్లస్టర్ పరిధిలోని ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజైన సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వివిధ రూపాల్లో దర్శనమిచ్చి అభయమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి కనులారా దర్శించుకున్నారు. 'జయములివ్వు తల్లీ.. జగజ్జననీ' అని వేడుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్

### వాసవీమాతను దర్శించుకున్న ఎస్పీ


అమ్మవారిశాలలో శ్రీదేవి అలంకరణ


ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న బుశెట్టి రాంమోహన్ రావు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దంపతులు సోమవారం రాత్రి దర్శించుకున్నారు. వారికి ఆర్యవైశ్య ప్రతినిధులు మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. ఎస్పీ దంపతులు వాసవీ మాతను దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్యవైశ్య సభ ప్రతినిధులు ఎస్పీకి ఆలయ ప్రాముఖ్యతలను తెలిపి వేదపండితులతో ఆశీర్వచనాలు, అమ్మవారి ప్రసాదం అందించారు. ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు ఎస్పీ దంపతులకు శాలువా కప్పి అమ్మవారి చిత్రపటం అందించి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో సభ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, ఆర్యవైశ్యసభ సెక్యూరిటీ సోషల్ వెల్ఫేర్ కన్వీనర్ సీవీ సురేష్, పోలేపల్లి రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.